ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023

సచివాలయాల్లో పక్కాగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-తాడిపత్రి

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. తాడిపత్రి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీ సర్వే అయిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయం రిజిస్ట్రేషన్ ప్రక్రియను జెసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా నూతన సాఫ్ట్‌వేర్ కార్డ్ 2.0లో రిజిస్ట్రేషన్లు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సులభమైన పద్ధతిలో రిజిస్ట్రేషన్ సేవలు అందించాలని ఆదేశించారు. పిడిఈ పద్ధతి ద్వారా ప్రజలు వారి పత్రాలను వారే తయారు చేసుకోగలరన్నారు. రిజిస్ట్రేషన్ అయిన హక్కుదారులకు వెంటనే రిజిష్టర్ పత్రాలను అందచేయాలన్నారు. నిషేధిత జాబితాను నిరంతరం నవీకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలన్ని తనిఖీ చేస్తున్న కేతన్‌గార్గ్

శింగనమల నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి ఎవరన్న దానిపై ఆ పార్టీలో సర్వత్రా చర్చ నడుస్తోంది. బండారు శ్రావణిని నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమించినట్టు ఒక లెటర్ సోషియల్ మీడియాలో ఇటీవల పెద్దఎత్తున సర్క్యులేట్ అయింది. అయితే అది అవాస్తవమని మరో లెటర్ కూడా సర్క్యులేట్ అయింది. పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేరుతో ఈ లెటర్లు సర్క్యులేట్ అవుతున్నాయి. ఈ లెటర్ల బయటకొచ్చిన నేపథ్యంలో అసలు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎవరన్నది చర్చ నడుస్తోంది.

శింగనమల

- బండారు శ్రావణిని నియమించారని లెటర్ సర్క్యులేట్
- అది అవాస్తవమని మరో లెటర్
- ఇంతకూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎవరన్న దానిపై చర్చ

టిడిపి ఇన్‌ఛార్జి ఎవరు..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో బండారు శ్రావణి శింగనమల నియోజకవర్గంకు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసింది. వైసిపి వేవ్‌లో ఓటమి చెందింది. ఆ తరువాత పోటీ చేసి ఓటమి చెందిన వారినే నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా కొనసాగిస్తూ వచ్చారు. అదే బాటలో బండారు శ్రావణిని నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా కొనసాగించారు. కొంతకాలం తరువాత ఆమెకు వ్యతిరేకంగా కొంత మంది నాయకులు గళం వినిపించారు. ఈ నేపథ్యంలో ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిని టూమెన్ కమిటీ పేరుతో ఎక్కడా లేని విధంగా ఒక కమిటీని వేశారు. అంతకుముందు నుంచి ఉన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బండారు శ్రావణిని తొలగిస్తున్నట్టు అధికార ప్రకటనేది లేదు. మొత్తం నియోజకవర్గ వ్యవహారాలు మాత్రం టుమెన్ కమిటీ ద్వారానే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ లెటర్ బయటకు రావడం చర్చకు దారితీస్తోంది. గడిచిన మూడున్నర సంవత్సరాలుగా ఇన్‌ఛార్జీ వ్యవహారంలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఇది క్షేత్ర స్థాయిలో పార్టీ నేతలు,కార్యకర్తల్లోనూ గందరగోళానికి దారితీస్తోంది. ఎవరి మాట వినాలో కూడా తెలియక కార్యకర్తలు, నాయకులు దిక్కుతోచని పరిస్థితుల్లోనున్నారు. ఇంత జరుగుతున్నా అధిష్టానం దీనికి ఫుల్‌స్టాప్ పెట్టే చర్యలేవి చేపట్టలేదన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల్లో ఎన్నికలు రాబోతున్న సమయంలోనైనా దీనికి స్పష్టతనిస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం వచ్చే ఎన్నికల్లో మరోమారు బండారు శ్రావణికి టిక్కెట్టు ఇస్తారా.? లేక కొత్త వారికిస్తారా.? అన్న చర్చ కూడా ఇంకో వైపు నడుస్తోంది. ఇప్పటికే అనేక పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ తెలుగుదేశం పార్టీలో త్వరలో చేరుతారాని, ఆయనకే టిక్కెట్టు ఉండే అవకాశముందని ప్రచారం నడుస్తోంది. ఇంకోవైపు కంబగిరి రాముడు, ఎంఎస్.రాజు తదితరులు కూడా టిక్కెట్టును ఆశిస్తున్న వారిలోనున్నారు. వీరందరూ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మార్పు ఉంటుందా.? లేక బండారు శ్రావణికే కొనసాగిస్తారా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. కొత్త వారికి అవకాశమిస్తే తరువాత పరిణామాలు ఏ రకంగా ఉంటాయోనన్న చర్చ కూడా నడుస్తోంది. పాతవారు ఏ మేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఏదిఏమైనా ఎన్నికలు సమీస్తున్న శింగనమల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో నెలకొన్న గందరగోళానికి పార్టీ ఫుల్‌స్టాఫ్ పెట్టలేకపోతోంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలోనే కాకుండా తెలుగుదేశం పార్టీకి పట్టున్న ఇక్కడ ఈ రకమైన గందరగోళం నెలకొంది.

1న ఎయిడ్స్ నియంత్రణ ర్యాలీ

డిఎంఅండ్‌హెచ్‌ఒ

ఈబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1వ తేదీన అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎయిడ్స్‌ను నిర్మూలించడంలో భాగంగా ప్రజలందరినీ భాగస్వాములను చేయటానికి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1వ తేదీన ఉదయం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణం నుంచి టవర్ క్లాక్, సుభాష్ రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిజ్ఞతో ర్యాలీ ముగుస్తుందని తెలిపారు. ఇందులో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ఉద్యోగులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలన్నారు. జిల్లాలో గత 5 సంవత్సరాల్లో 2390 మందికి హెచ్ఐవి ఉందని నిర్ధారణ అయ్యిందన్నారు. వారిలో 2200 మంది ఎఆర్‌టి కేంద్రాల్లో నమోదు చేసుకున్నారని, వారిలో 1690 మంది మందులు క్రమం తప్పకుండా వాడుతున్నారని తెలిపారు.

పాలస్తీనాలో పసిపిల్లలను కాపాడాలి

ఇజ్రాయిల్ మారణ హోమం హేయం

దీపాలు వెలిగించి నివాళులర్పిస్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇజ్రాయిల్ మారణ హోమంలో బలవుతున్న పాలస్తినాలో అమాయక పిల్లలను కాపాడాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. బుధవారం పాలస్తీనాలో పసిపిల్లల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆవాజ్ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద విద్యార్థినులతో దీపాలు వెలిగించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న యుద్ధంలో వేలాది పసి ప్రాణాలు హరించకపోతున్నాయని తెలిపారు. 1946 నవంబర్ 29న పాలస్తీనాకు ఐక్య రాజ్యసమితి మొట్ట మొదటి సారి సంఘీభావాన్ని తెలిపిందన్నారు 77 సంవత్సరాల తర్వాత తిరిగి పాలస్తీనాకు ప్రపంచ ప్రజలందరూ సంఘీభావం తెలపాల్సిన పరిస్థితి ఏర్పడడం సామ్రాజ్యవాదం కుట్ర ఫలితమేనని తెలిపారు. అమెరికా అండతో పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుంటూ ఉగ్రవాద భూతాన్ని చూపి ఆ దేశాన్ని ఆ దేశంలోని ప్రజలను అంతం చేయడానికి ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందన్నారు. జాతీయ ఉద్యమం నుంచి పాలస్తినాకు అండగా ఉన్న భారతదేశం నేడు మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం దారుణమని విమర్శించారు. పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిలో ఇప్పటికే 12,800 మంది ప్రజలు మరణించారని, అందులో 5400 మంది పసిపిల్లలు ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింద న్నారు. తక్షణం పాలస్థినపై దాడులు ఆపాలని ప్రపంచ దేశాలు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ ఖాతరు చేయ కుండా అమెరికా అండతో చెలరేగుతోందన్నారు. శాంతి కాముకులంతా పాలస్తీనాకు అండగా నిలబడాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు శ్యామ లమ్మ, రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, అధ్యక్షులు బాలక్రిష్ణ, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముస్కిన్, ప్రజా సంఘాల నాయకులు ప్రకాష్, రామిరెడ్డి, మహదేవ్ నగర్ బాబు, ముత్తుజా, సురేష్, ఫరీదా, ఫక్రు, గిరి, శివ, ఇస్మాయిల్, రాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

సమావేశంలో మాట్లాడుతున్న వై.మోహన్

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షులు వై.మోహన్ తెలిపారు. 38వ జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుమ్మగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో వినియోగదారుల రక్షణ చట్టం పై విద్యార్థులకు బుధవారం నాడు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీలు, అనుకరణలు, తక్కువ తూకాలు, ఒకటి కొంటె ఒకటి ఉచితం అనే వాటి వల్ల వినియోగదారులకు నష్టం వాటిల్లితోందన్నారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వస్తువుల కొనుగోలు, సేవల వినియోగంలో లోపమున్నట్లైతే వినియోగదారుల కోర్టుకు వెళ్తే మూడు నెలలల్లోపు న్యాయం పొందొచ్చని సూచించారు. అనంతరం వినియోగదారుల హక్కుల రక్షణకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ డాక్టర్ రామచంద్ర, సిఆర్‌పిఒ అధ్యక్షులు మోహన్, ఎంఇఒ వైద్యుడు రామచంద్ర, ప్రధానోపాధ్యాయుడు యోగీందర్ నాథ్, నాగరాజ్, దుర్గాప్రసాద్, మహాదేవి పాల్గొన్నారు.

మెప్మా స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

మహిళా సాధికారతే జగనన్న ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలోని ప్రతి మహిళా తమ స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీసర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తీసుసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

డీఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తునన సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

వారంరోజులుగా పట్టణంలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నర్సింగప్పను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా పట్టణంలో దొంగలు రాత్రి వేళలో యథేచ్చగా ఇళ్లలోకి చొరబడి బంగారు నగలు, నగదు దోచుకుంటున్నారన్నారు. ముఖ్యంగా పట్టణంలోని సత్యనారాయణపేట రోడ్డు, మార్కెట్, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, 60 అడుగుల రోడ్డు, కొత్త బస్టాండ్, తిలక్‌నగర్, ఉమామహేశ్వర్ నగర్, తదితర ఏరియాల్లో చోరీలు అధికమయ్యాయన్నారు. గతంలో రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ వీధివీధుల్లో, మెయిన్ రోడ్‌లో తిరిగేవారన్నారు. దీంతో రాత్రి 10 గంటలైతే రోడ్లమీద ఆకతాయిలు, రౌడీలు కనపడేవారు కాదన్నారు. అయితే ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. రాత్రి ఒంటి గంట అయినా రోడ్ల మీద ఆకతాయిలు తిరుగుతున్నారన్నారు. పోలీస్ శాఖ వెంటనే స్పందించి రాత్రిపూట పెట్రోలింగ్ ఏర్పాటు చేసి ప్రజలను దొంగల బారి నుంచి కాపాడాలని కోరారు. అదేవిధంగా డిగ్రీ, ఇంటర్ మహిళా కళాశాలల వద్ద పోకిరీలు విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, షేక్ షబ్బీర్‌బాషా, సురేంద్ర, తిమ్మప్ప, చంద్ర, ఓబులేసు, నాయక్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను సందర్శించిన ఘోర్పాడే వారసుడు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి కోటలో ఉన్న ఫిరంగి వద్ద ఘోర్పాడే వారసుడు

పట్టణ సమీపంలోని గుత్తి కోటను మరాఠా రాజు కాలంలో సైనికాధ్యక్షుడిగా పని చేసిన మురారి ఘోర్పాడే వారసుడు ఇంద్రజిత్ ఘోర్పాడే బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపకుడు సి.విజయభాస్కర్ స్వాగతం పలికారు. ఇందులో భాగంగా కోటలోని కట్టడాలను వీక్షించారు. అనంతరం ఇంద్రజిత్ ఘోర్పడే మాట్లాడుతూ 1735 నుంచి 1773 వరకూ గుత్తి కోటను మరాఠా రాజుల కాలంలో మురారి ఘోర్పడే సైనిక అధ్యక్షుడిగా పని చేశారు. దాదాపు 30 వేల సైన్యంతో ఉన్న మురారిజీ పోరాట పటిమతో, పరిపాలన దక్షుడిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. అలాంటి మహానుభావునికి వారసుడిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇప్పటికి చక్కగా ఉన్న మురారిఘోర్పాడే గద్దెను చూచి పులకించి, ఆనంద డోలికల్లో మునిగిపోయామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో గుత్తి కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతామని వివరించారు. కోటలో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గుత్తి కోట చరిత్రకు సంబంధించిన పుస్తకాలను విజయభాస్కర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముంబైకి చెందిన రచయిత్రి రిటా రామమూర్తి గుప్తా, కో ఫౌండర్, అఖిల భారతీయ క్షత్రియ మరాఠా ఫౌండేషన్ ఎపి అధ్యక్షులు మరాఠా వెంకట్ సోమాజి, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి,ఆంధ్రప్రదేశ్ మరాఠ సంఘం ప్రధానకార్యదర్శి కాలే వెంకటరామయ్య, గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు దేవేంద్ర రాయల్, శివకుమార్, భాషా, పురావస్తు సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌లు చేసేటప్పుడు నిబంధనలు పాటించాలి

డీఎస్పీ గంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి

గనుల్లో పేలుడు పదార్థాల ద్వారా బ్లాస్టింగులు చేసేటప్పుడు తప్పకుండా నిబంధనలు పాటించాలని డీఎస్పీ సిఎం గంగయ్య సూచించారు. ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు తాడిపత్రి సబ్-డివిజన్ పరిధిలోని మైన్స్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గనుల్లో పేలుడు పదార్థాలు ఉపయోగించి బ్లాస్టింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్లాస్ట్ చేసేందుకు సంబంధిత మైన్స్, జియాలజీ విభాగాల అనుమతి తీసుకోవాలన్నారు. ఒకవేళ థర్డ్ పార్టీలతో బ్లాస్టింగ్ చేయించుకునేటప్పుడు సదరు ఏజెన్సీ వారితో తప్పక అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు. బ్లాస్టింగ్‌కు అనుమతి పొందిన వారితోగానీ, వారి పర్యవేక్షణలోగానీ బ్లాస్టింగ్ చేసుకోవాలన్నారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో చుట్టుపక్కల 500 మీటర్ల వరకూ ప్రజలు ఎవ్వరూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పేలుడు పదార్థాలైన స్లర్రీ, నైట్రోజన్, డిటోనేటర్స్, సేఫ్టీఫ్యూజ్‌లను లైసెన్సు పొందిన వారి నుంచే కొనుగోలు చేయాలన్నారు. బ్లాస్టింగ్ ఎంత అవసరమో అంత మోతాదులో మాత్రమే పేలుడు పదార్థాలను కొనుగోలు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యాడికి సిఐ శంకర్ రెడ్డి, అసిస్టెంట్ జియలాజిస్ట్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గనుల యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి జయరాములును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాల్లో నాడు-నేడు పనులు పూర్తిగా ఆగిపోయిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను తెరవకముందే నాడు-నేడు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి పాఠశాలలు తెరిచి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఉరవకొండ మండల కేంద్రంలోని పాతపేట ఎంపీపీ స్కూల్లో నాడు-నేడు పనులు పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులకు తరగతి గదులు లేక ఆరుబయటే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రధానంగా నాడు-నేడు పనులు పూర్తి కాకపోవడానికి గుత్తేదారులు చెబుతున్న కారణం ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని చెబుతున్నారన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించి పనులను పూర్తి చేసి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు హిరణ్య, నందు, మహేష్, రాజేష్, వంశీ, అశోక్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ సభ్యుల సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిటిడి, సెనెట్ సభ్యులను సన్మానిస్తున్న సిటిజన్ ఫోరం సభ్యులు

ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ సిటిజన్ ఫోరమ్ సభ్యులుగా అందించిన సేవలు ఆదర్శనీయంగా నిలిచాయని పలువరు వక్తలు కొనియాడారు. టిటిడి కమిటీ సభ్యులు సి.అశ్వర్థనాయక్, జెఎన్‌టియు అనంతపురం సెనెట్ మెంబర్ హరీష్ చంద్రరామ్ ఎన్నికైన సందర్భంగా జిల్లా సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యంలో బుధవారం బళ్లారి బైపాస్ వద్ద ఉన్న వైభవ్ రెసిడెన్సీలోని సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిటిజన్ ఫోరమ్ ప్రెసిడెంట్ ఎల్.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నారాయణప్ప, సభ్యులు ఎస్ఆర్.నాగభూషణం, బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, బషీర్, నరసింహారెడ్డి, బండి పార్థసారథి సిటిజన్ ఫోరమ్ సభ్యులుగా ఉండి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌ను గుర్తించి పదవి వరించిందని ఆనందం వ్యక్తం చేవారు. టిటిడి బోర్డ్ కమిటీ సభ్యులు సి.అశ్వర్థనాయక్ మాట్లాడుతూ సిఎం జగన్ ఆశీస్సులతో గిరిజన సమాజిక వర్గం నుంచి తనను టిటిడి కమిటి మెంబర్‌గా నియమించినందుకు కృతజ్ఞులై పని చేస్తానన్నారు. తొలిసారిగా టిడిపి పాలక మండలిలో గిరిజనులను భాగస్వామ్యులను చేయడం తమ జాతి అదృష్టం అన్నారు.

దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని దొంగ ఓట్లపై, పారం-7 అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి డిమాండ్ చేశారు. బుధవారం టిడిపి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో అనంతపురం ఆర్‌డిఓ గ్రంధి వెంకటేష్‌ను ఆధారాలతో సహా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో తెలుగుదేశం పార్టీ బిఎల్‌ఏలు ఓటర్ల లిస్టు విచారణ చేపడుతున్న సమయంలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఒక ఇంటిలో డోర్ నెంబర్ 11-1-86 లో 21 ఓట్లు, డోర్ నెంబర్ 11-1-653లో 20 ఓట్లు, బూత్ నెంబర్ 147 లో 52 ఓట్లు దొంగ ఓట్లు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జింక రాఘవేంద్ర అనే వ్యక్తి డోర్ నెంబర్, ఫోన్ నెంబర్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా వివిధ తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపు చర్యలు చేపట్టారని, అందులో భాగంగా జింక రాఘవేంద్రను విచారించగా తాను రెండేళ్లుగా అనంతపురంలో నివాసం ఉండడం లేదని, తన ఆధార్ కార్డు వివరాలతో ఎవరో ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇదే విషయాన్ని అధికారులకు తెలియజేశారని సమాధానం ఇచ్చారన్నారు.

ఆర్‌డిఓ గ్రంధి వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభాకర్‌చౌదరి

సచివాలయాలతో ప్రజల వద్దకే సంక్షేమం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వ పాలనను సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి అన్నారు. బుధవారం యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి, చింతకాయమంద గ్రామాల్లో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌లు, కల్లూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలో సామాన్యులు తమ సమస్యలను చెప్పాలంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడేవారన్నారు. అదే జగనన్న ప్రభుత్వ పాలనలో సచివాలయాల ద్వారా అలాంటి సమస్యలకు చెక్ పెట్టారన్నారు. గ్రామాల్లోని ప్రజలు తమ ఊరు దాటి వెళ్లకుండా ఉన్న ఊరిలోనే వైద్య చికిత్సలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి దేశంలో ఏరాష్ట్రంలోనూ లేనివిధంగా వైద్య, ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అలాగే తిమ్మంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి చింతకాయమంద గ్రామంలోకి దాదాపు రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన తారురోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం బొప్పేపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాయాలన్ని ప్రారంభిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

'జగనన్నకు చెబుదాం'లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-తాడిపత్రి/తాడిపత్రి రూరల్

ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని ఎస్‌వి.ఫంక్షన్ హాలులో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము 25ఏళ్లుగా మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్నా ఒక కార్మికుడిని కూడా రెగ్యులర్ చేయలేదన్నారు. అంతేగాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ఏ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కేటగిరి విధానం అములు చేయాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మిక సిబ్బందిని పెంచాలని, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ వర్తింపజేయాలని, 60ఏళ్లు దాటిన వారికి, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని కోరారు.

అలాగే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు పరిహారం చెల్లించాలని, బ్యాంకు రైతుల అప్పులు మాఫీ చేసి, ఉపాధి హామీ ద్వారా 200 రోజులు పని కల్పించి రోజు కూలి రూ.600 సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అలాగే గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని తాము కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఇప్పటికే దశలవారీగా ఆందోళనలు, కలెక్టరేట్ వద్ద ధర్నా చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు రాజు, రామకృష్ణ, సంధ్యాబాయి, అచ్చమ్మబాయి, కుళ్లాయప్ప, తదితరులు తెలిపారు. అలాగే 2021 నుంచి నిలిపివేసిన వేతనాలను చెల్లించాలని విఎఒలో జెసికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు యానిమేటర్లు హనుమంతురెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త హత్య బాధాకరం

అంత్యక్రియల్లో పాల్గొన్న టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

యల్లనూరు మండలంలోని మేడికుర్తి గ్రామంలో టిడిపి కార్యకర్త కురుబ మల్లికార్జున (36) హత్య బాధాకరమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. మూడడుగుల నేల కోసం జరిగిన ఘర్షణలో మల్లికార్జున హత్యకు గురైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బండారు శ్రావణిశ్రీ గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణిశ్రీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో భూకబ్జాలు మితిమీరిపోయాయన్నారు. అడ్డు వచ్చిన బడుగు, బలహీన వర్గాలకు చెందినవారిని హత్యలు చేయడమే వైసిపి పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వం ధన దాహం, కక్షసాధింపుతో హత్యా రాజకీయాలు చేస్తోందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో చేస్తున్న విధ్వంసక పరిపాలనను వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా అంతమొందించాలని పిలుపునిచ్చారు. కాగా మల్లికార్జున కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

శింగనమల : యల్లనూరు మండలం మేడకుర్తి గ్రామంలో జరిగిన కురుబ మల్లికార్జున హత్య దారుణమని అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో బడుగు, బలహీన వర్గాలపై దాడులు అధికమయ్యాయన్నారు. ఒక్కఛాన్స్ పేరుతో వచ్చిన సిఎం జగన్ బడుగులను నట్టేట ముంచుతున్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మాజీ ఎమ్మెల్యే విశ్వ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ అధికారంలోకి వచ్చార పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. బుధవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని సమర్థవంతంగా, సమగ్రంగా, సంపూర్ణంగా అమలు చేస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. నియోజకవర్గంలోని 76 సచివాలయాల ద్వారా 35,280 గడపలను సందర్శించినట్లు వివరించారు. ఇందులో ఎక్కడ చూసినా ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. కావున ఈ పథకాలన్నీ కొనసాగాలంటే తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరన్న, పెన్న ఓబులేసు, రమావత్‌దేవి, సోమశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, నరసింహులు, ఏసీ పార్వతమ్మ, చంద్రమ్మ, సుధీర్‌రెడ్డి, వడ్ల షేక్షావలి, తేజోనాథ్, గోవిందు, రామాంజనేయులు, తిప్పయ్య, వెంకటరెడ్డి, సామానాయక్, వైద్యనాథ్‌రెడ్డి, ప్యాపిలి భీమా, కిష్టప్ప, రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

'ముల్లంగి' సోదరులను కలిసిన ఎంపీ

బొమ్మనహాల్ : మండలంలోని ఎల్‌బినగర్‌లో నివాసం ఉంటున్న ఉప్పరాల సర్పంచి భర్త భాస్కర్‌నాయుడు, ఎంపిటిసి భర్త ముల్లంగి నారాయణస్వామి ఎంపీ తలారి రంగయ్య బుధవారం వారి స్వగృహాల్లో కలిశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముల్లంగి సోదరులు గత కొన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎంపీ కలవడం పట్ల మండలంలో రాజకీయ చర్చ మొదలైంది. అనంతరం ఉద్దేహాల్‌లో నిర్వహిస్తున్న గజ గౌరీ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాతి దూలం లాగుడు పోటీలను ఎంపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కోటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగి సోదరులతో ఎంపీ తలారి రంగయ్య

విశ్రాంత వ్యవసాయ అధికారులకు సన్మానం

సన్మానం పొందిన విశ్రాంత వ్యవసాయ అధికారులు

అనంతపురం : వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విశేష సేవలు అందించి పదవీ విరమణ చేసిన 75 ఏళ్ల నుంచి 95 ఏళ్ల మధ్య ఉన్న అధికారులను మంగళవారం అనంత కృషి భవన్‌లో ఘనంగా సత్కరించారు. రాబోవు రోజుల్లో రిటైడ్ అగ్రి కల్చర్ ఆఫీసర్ అసోసియేషన్ ద్వారా సభ్యులకు ఉచిత వైద్యశిబిరాలు, సంఘం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున, ట్రెజరర్ రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విశ్రాంత జిల్లా వ్యవసాయ అధికారి ఠాగూర్‌నాయక్, డిప్యూటీ డైరెక్టర్ హరిచంద్రారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, గురుమూర్తి, అనంతపురం డివిజన్ ఎడిఎ ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన షర్మస్‌వలి దర్గా ఉరుసు మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా గురువారం గంధం, 30న మొదటి దీపారాధన, వచ్చేనెల 1న శుక్రవారం రెండో దీపారాధన, శనివారం ఉరుసు, శంషుర్, ఆదివారం జియారత్ నిర్వహించనున్నట్లు దర్గాపెద్దలు తెలిపారు. ఉత్సవంలో సర్పంచి శకుంతలమ్మ, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాషా, దర్గా పెద్దలు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహప్రతిష్టాపన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, పామిడి వీరా, వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ రామచంద్ర, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

2న మండల సర్వసభ్య సమావేశం

ఉరవకొండ : ఎంపిపి కరణం పుష్పవతి భీమిరెడ్డి ఆదేశాల మేరకు వచ్చేనెల 2న విడపనకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసి, సర్పంచులు, మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

శంకుస్థాపనలు, భూమిపూజలతోనే సరిపోయింది

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లు : సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక కేవలం శంకుస్థాపనలు, భూమిపూజలతోనే సరిపోయింది తప్ప, చేసిన అభివృద్ధి శూన్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. బుధవారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో సిఎం జగన్, గుంతకల్లులో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. ఇక మిగిలిన మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకు అభివృద్ధి పనులకు భూమిపూజలు చేస్తున్నారన్నారు. అధికార పార్టీ తప్పులను ఎత్తిచూపుతున్న సిపిఐ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనానరు. క్లాప్ ఆటో డ్రైవర్లు బకాయిల వేతనాల కోసం దీక్షలు చేస్తే సదరు ఏజెన్సీ ద్వారా వేతనాలు ఇప్పించి, 26 మంది ఆటో డ్రైవర్లను పనుల నుంచి తొలగించారన్నారు. వారికి అండగా నిలిచిన సిపిఐ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట నాయకులు, అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు మహేష్, గౌస్, కొట్టాల రామాంజినేయులు, కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మనం చేసింది ప్రజలకు వివరిద్దాం

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో సీఎం జగన్ నాయకత్వంలో నాలుగున్నరేళ్లుగా చేసిన మంచిని ప్రతి ఒక్కరికీ వివరిద్దామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 23వ డివిజన్ 12వ సచివాలయం, రుద్రంపేటలోని 3వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డులు, వైసీపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కలిసి దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. విద్య, వైద్యం అనేది పేదలకు భారం కాకూడదన్న లక్ష్యంగా అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు వివరించారు. గతంలో జన్మభూమి కమిటీలు దోపిడీ చేస్తే నేడు సచివాలయ వ్యవస్థ ప్రజలకు చేరువగా ఉంటోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దే న్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా నిర్ణయించాల్సింది ప్రజలేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హరిత, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, మాజీ కార్పొరేటర్ పోతులయ్య, సచివాలయ కన్వీనర్లు జ్యోతి, గోవిందు,మల్లికార్జున రెడ్డి, నాయకులు సంపంగి రాయుడు, నాగేంద్ర, వైస్ ఎంపిపి బాలాజీ, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ కన్వీనర్ హుస్సేన్, సర్పంచి సుగాలి పద్మావతి, ఎంపిటిసిలు మహబూబ్‌బీ, నారాయణమ్మ, వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, గోవిందరెడ్డి, ఉప్పర నవీన్, రామమూర్తి, రామచంద్రారెడ్డి, సంజీవరాయుడు, సాధిక్, రాజరత్నం, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, వడ్డే సుధాకర్, రాజునాయక్, అక్కులప్ప, పురుషోత్తం, వెంకటేష్‌నాయక్, విజయ్‌కుమార్, వెంకటేష్, వెంకట్రాముడు, పద్మావతి, సాయి ప్రవల్లిక, అక్కమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప అన్నారు. బుధవారం పట్టణంలోని 22, 25 ఎన్నికల వార్డులకు సంబంధించి 13వ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డు సభ్యులు పెద్ద వన్నూరప్పతో కలిసి సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వివరాల ప్రదర్శన పట్టికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనుడు సిఎం జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత, నాయకులు

ఉరవకొండ : విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిపొందిన వివరాలను ప్రజలకు వివరిస్తూ, లబ్ధిపొందిన వివరాలను తెలియజేసే బోర్డును సచివాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున, ఇఒఆర్‌డి సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి రమ్య, కరకముక్కల వైసిపి నాయకులు రామురెడ్డి, సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఉప సర్పంచి జయలక్ష్మి, రామన్న, తిప్పయ్య, నరేంద్రరెడ్డి, రాజు, వార్డు మెంబర్ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమాచార కేంద్రాలుగా ఎరువుల దుకాణాలు

ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి

ప్రజాశక్తి-అనంతపురం

ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలు రైతు సమాచార కేంద్రాలుగా మారి సేవలు అందించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. ఫెసిలిటేటర్ డాక్టర్ పి.లక్ష్మీరెడ్డి అధ్యక్షతన బుధవారం స్థానిక అనంత కృషి భవన్‌లో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ సర్వెస్స్ ఫర్ ఇన్ ఫుట్ డీలర్లు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఇస్తూ ఉండాలన్నారు. ఇందుకోసమే మేనేజ్, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లు నైపుణ్యం పెంచడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిప్లొమా ఇన్ ఎక్స్ టెన్షన్ సర్వేస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ ఒక ఏడాది శిక్షణ అందించి వారికి సర్టిఫికెట్ అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మేనేజ్ సంస్థ అధికారి అర్చన, ఎక్స్‌ట్రనల్ ఎగ్జామినర్ లక్ష్మణ్, విశ్రాంత వ్యవసాయ అధికారి ఆదినారాయణ, సాంకేతిక వ్యవసాయ అధికారి ప్రతాప్, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

విలేకరులతో మాట్లాడుతున్న ఎఐఎంఐఎం నాయకులు

కులమతాల మధ్య చిచ్చుపెట్టే ఆలోచనలు మానుకోవాలి

గుంతకల్లు : బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కులమతాల ఐక్యతకు చిచ్చుపెట్టే ఆలోచనలను మానుకోవాలని ఎఐఎంఐఎం పట్టణ బాధ్యులు ఏరూరు బాషా, విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌బాషిద్, జనజాగరణ కమిటీ అధ్యక్షుడు షంషుద్దీన్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎఐఎంఐఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ముస్లిముల అధ్వర్యంలో ఈనెల 11న జరిగిన హజరత్ టిప్పుసుల్తాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాటాలు చేసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అశువులు బాసిన టిప్పు సుల్తాన్‌ని దేశ ద్రోహి అని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఉద్దేశ పూర్వకంగా మాట్లాడిన బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, స్థానిక నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో క్రిష్టియన్ మైనారిటీ కమిటీ అధ్యక్షుడు అరోగ్యదాస్, పట్టణ జనజాగరణ కమిటీ సభ్యుడు అబ్దుల్ నజిర్ అహ్మద్, మైనారిటీ నాయకులు జాకీర్, ఎఐఎంఐఎం 32వ ఇన్‌ఛార్జి కె.దీపక్, నాయకులు ఉస్మాన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం మండల పరిధిలోని కడవకల్లు, సంజీవపురం గ్రామాల్లో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎంపిపి రాఘవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

అనంతపురం : అనంతపురం రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ పి.శేషగిరి, ఎఇఇ ఎల్.రవీంద్రనాథ్, సిబ్బందితో కలిసి గుత్తి మండలంలోని కొడికొండ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అమలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ప్రదర్శన పట్టికలు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

పెద్దపప్పూరు : మండల పరిధిలోని గార్లదిన్నె, పసలూరు గ్రామాల్లో ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, పీఎం కిసాన్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, గరీబ్ కళ్యాణ్ యోజన, విశ్వకర్మ యోజన, పోషక అభియాన్, ఉజ్వల యోజన, పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల ద్వారా కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఎంపిటిసిలు, మెడికల్ ఆఫీసర్లు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మరమ్మతులకు నిధులు మంజూరు

గుత్తి : ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ భవనాల మరమ్మతుల కోసం నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరైనట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ఎన్.డిల్లేశ్వరి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లో ఉన్న 85 అంగన్వాడీ కేంద్రాల భవనాలు మరమ్మతుల కోసం రూ.96 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, కేంద్రాలకు పెయింటింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ కోసం వినియోగిస్తామని తెలిపారు.

నేడు కనకదాస జయంతి వేడుకలు

అనంతపురం : నేడు కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కుష్బూ కొఠారి బుధవారం ఒక తెలిపారు. కనకదాసు జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

బేతాపల్లి వైద్యాధికారిగా ప్రవీణ్‌కుమార్

గుత్తి : మండలంలోని బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ సందీప్‌యాదవ్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. దీంతో యాడికి ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందిస్తామన్నారు.

బెటాలియన్ కానిస్టేబుల్‌కి ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం : మండలంలోని జంతలూరు 14వ బెటాలియన్‌లో పని చేస్తూ మరణించిన కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్ భార్య దీపికకు సిసిఎస్ డెత్ రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కును కమాండెంట్ గంగాధరరావు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎఒ నాగభూషణమ్మ, అసిస్టెంట్ ఎఒ విజయ్‌కుమార్, సిసిఎస్ ఇన్‌ఛార్జి రిజర్వ్‌డ్ సబ్ ఇన్స్‌పెక్టర్ సురేష్, పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం అధికారిగా నాగరాజు

పెద్దవడుగూరు : మండలంలోని దిమ్మగుడి గ్రామం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర నూతన అధికారిగా డి.నాగరాజు బాధితులు చేపట్టారు. ఈయన ఉన్నత చదువుల కోసం (బిఇడి) రెండేళ్లుగా సెలవులో వెళ్లారు. తిరిగి విధుల్లోకి చేరడంతో కలెక్టర్ ఉత్తరువుల మేరకు నూతన హాస్టల్ సంక్షేమాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

ఒటిపిఆర్ఐ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : 62వ జాతీయ ఫార్మసీ వీక్ సందర్భంగా స్థానిక రైపర్ కళాశాల ఆధ్వర్యంలో నవంబర్ 20 నుంచి 25వ తేదీల్లో నిర్వహించిన క్రీడాపోటీల్లో జెఎన్‌టియు, ఒటిపిఆర్ఐ ఫార్మసీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అబ్బాయిల విభాగంలో క్రికెట్‌లో రన్నరప్, షాట్‌పుట్‌లో శ్రీనాథ్ మొదటి స్థానం, 100మీ పరుగుపందెంలో వంశీకృష్ణ మూడవ స్థానం, అమ్మాయిల విభాగంలో 100మీ పరుగుపందెంలో నందిని రెండవ స్థానం, షాట్‌పుట్‌లో అనిత మూడవ స్థానంలో నిలిచి సత్తాచాటారు. సత్తాచాటిన విద్యార్థులను ఒటిపిఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, కళాశాల సిబ్బంది అభినందించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంతవాసికి తృతీయ స్థానం

అనంతపురం : 27వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ పోటీలో అనంతపురం వేణుగోపాల్ నగర్‌కు చెందిన శివతేజ తృతీయ స్థానాన్ని సాధించాడు. శివతేజ ఇటీవల ఎలమంచిలో జరిగిన రాష్ట్రస్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని 70-75 కిలోల కేటగిరిలో తృతీయ స్థానం సాధించి సత్తాచాటారు. మిస్టర్ ఆంధ్రాగా ఎన్నిక కావడం పట్ల తల్లిదండ్రులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, అరుణ, నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులపై అవగాహన

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రఘురామమూర్తి మాట్లాడుతూ యువత ప్రతిదానిపై ఇతరులపై ఆధారపడుతోందన్నారు. కావున ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతులపై అవగాహన ఉంటే ఇంట్లోని సొంతంగా రిపేరి చేయించుకోవచ్చన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ కౌశల్య యోజన డొమైన్ ట్రైనర్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చెడిపోయిన చిన్న వస్తువులను ఎలా మరమ్మతు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ప్రసాద్, నాగప్ప, ఉమర్ షరీఫ్, రవికుమార్, కిరణ్, ఫరీసా ఫిర్దోష్, విజయ్‌కుమార్, బాబు, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

అనంతపురం : ఐక్యంగా ఉండి పోరాటాలు చేస్తేనే తమ హక్కులను కాపాడుకుంటామని అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు నగరంలోని సుమారు 15 మంది ముత్తువలిలు ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహ్మద్‌ను బుధవారం కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సుమారు 80 వేల మంది ముస్లింలు ఉన్నారన్నారు. వారందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకునేందుకు వీలవుతుందన్నారు. నగరంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా కల్మా చదివే ప్రతి ఒక్కరూ ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉండాలని కోరారు.

బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పిడిఎస్‌యు జిల్లా నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెస్ట్ యూనివర్శిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం అక్కంపల్లి సమీపంలోని బెస్ట్ యూనివర్శి వద్ద ధర్నా నిర్వహించారు. పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్, ఐసా అబ్దుల్ ఆలం, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరుశు రాం, పిడిఎస్‌ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే అశోక్ కుమార్, ఐసా జిల్లా ఉపాధ్యక్షులు ప్రతిభా భారతి హాజరై మాట్లాడుతూ యూనివర్సిటీ ముందుగా గోరంట్ల దగ్గర ఉందని, కేవలం అడ్మిషన్‌లు కావడం లేదనె నెపంతో ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌ని అడ్మిషన్‌ల పేరుతో లక్షల రూపాయలు దండుకోవాలని 14 సంవత్సరాలు అక్కంపల్లి వద్ద ఉంటుందని మభ్యపెట్టి విద్యార్థుల తల్లి తండ్రులతో డబ్బులు వసూలు చేసిన తర్వాత ఇప్పుడు ఇక్కడి నుంచి తరలిస్తునామని చెప్పడం అన్యాయంగా ఉందన్నారు. బెస్ట్ యూనివర్సిటీ సంబంధించిన విద్యార్థులకు న్యాయం చేయాలని లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.